ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 10.10.2023 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కేంద్ర హోంమంత్రి , బీజేపీ సీనియర్ నేత అమిత్ షా ఈరోజు మధ్యాహ్నం ఆదిలాబాద్ లో జరిగే బహిరంగ సభలో ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. సికింద్రాబాద్ లో పలువురు మేధావులతో సమావేశం కానున్నారు.
2. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా 148 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు. ఈ తనిఖీల్లో నిన్న ఒక్కరోజే 18 కోట్ల రూపాయల నగదు పట్టుబడింది.
3. మహబూబ్ నగర్ శాసనసభ్యుడు, రాష్ట్ర అబ్కారీ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎన్నికకు సంబంధించి దాఖలైన పిటిషన్ను హైకోర్టు ఈరోజు కొట్టివేసింది
4. వన్డే ప్రపంచ కప్ క్రికెట్ టోర్నమెంట్లో ఈరోజు హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్ లో శ్రీలంకతో, పాకిస్థాన్ జట్టు తలపడనుంది.

తెలంగాణ- అమిత్ షా

కేంద్ర హోంమంత్రి , బీజేపీ సీనియర్ నేత అమిత్ షా ఈరోజు రాష్ట్రంలో పర్యటిస్తారు. ఈ మధ్యాహ్నం ఆదిలాబాద్ పట్టణంలోని మల్టీ పర్పస్ గ్రౌండ్ లో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సాయంత్రం సికింద్రాబాద్‌లో పలువురు మేధావుల సమావేశంతో అవుతారు. ఈ రెండు కార్యక్రమాలతో అమిత్ షా రాష్ట్రంలో బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు , కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం జరుగుతోందని, రాష్ట్రంలో ప్రభుత్వం మారాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

రాజకీయ మార్పు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. బీజేపీయే ప్రత్యామ్నాయమని ప్రజలు నిర్ణయించుకున్నందున బీఆర్ఎస్ , కాంగ్రెస్‌లు రెండు , మూడు స్థానాల్లో పోటీ పడతాయన్నారు.

PTC, ADB

ఎన్నికల కోడ్

కేంద్ర ఎన్నికల సంఘం నిన్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించగానే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 148 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిన్న టి నుంచి విస్తృత తనిఖీలు ప్రారంభించారు. ఈ తనిఖీల్లో నిన్న ఒక్క రోజే 18 కోట్ల రూపాయల నగదు పట్టుబడింది. పట్టుబడ్డ నగదును పోలీసులు ఆదాయపన్ను శాఖకు అప్పగించారు.
హైదరాబాద్ నిజాం కాలేజీ వద్ద పోలీసుల తనిఖీల్లో 7 కిలోల బంగారం , 300 కిలోల వెండి పట్టుబడింది. దీని విలువ సుమారు10 కోట్ల రూపాయల వరకు ఉంటుంది. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తారానగర్‌లో 5.65 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం జిల్లాలో 10 లక్షలు , నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలో 5.40 లక్షలు , కరీంనగర్ మండలం మొగ్దుంపూరులో 3 లక్షల నగదు లభించాయి. హైదరాబాద్‌లోని జుబ్లీహిల్స్ , ప్రగతినగర్, మధురానగర్ , బోరబండ ప్రాంతాల్లో పోలీసులు అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

డెస్క్

వనపర్తి-ఎన్నికలు

ప్రతి ఒక్క అధికారి నిష్పక్షపాతంగా , పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేలా విధులు నిర్వహించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఈరోజు వనపర్తిలో జిల్లాలోని ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ

సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ   భారత ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రకటించిన నేపథ్యంలో కోడ్ ఆఫ్ కాంటాక్ట్ ఎన్నికలు ముగిసేంత వరకు అమలులో ఉందన్నారు.

(పీటీసీ, వనపర్తి)

సిరిసిల్ల-ఎస్పీ

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుత , ప్రశాంత వాతావర ణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం పని చేస్తుందని   జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ చెప్పారు. వాట్సప్, ట్విటర్, ఫేస్ బుక్ లలో అభ్యంతర పోస్టులు పెట్టే వారిపై జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా సరిహద్దుల్లో ఆరు చోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

PTC, SIRCILLA

వరంగల్ –కలెక్టర్

ఎన్నికలు నిష్పక్షపాతంగా,  జరిగేందుకు వరంగల్ జిల్లాలోని ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన ఫిర్యాదుల కొరకు వరంగల్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్  , వాట్సప్ నంబర్లను చేసినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన అమల్లోకి రావడంతో రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు ,  బ్యానర్లు,  పోస్టర్లు,  పెయింటింగ్ తొలగించేందుకు చర్యలు   చేపట్టినట్టు వెల్లడించారు.

PTC, WGL

కరీంనగర్-కోడ్

కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర శాసన సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో కరీంనగర్ లో ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బి. గోపి తెలిపారు. జిల్లాలో 14 మందితో ఎఫ్.ఎస్.టి. , 14 మందితో ఎస్.ఎస్.టి. , 9 మందితో వి.ఎస్.టి., 5 మందితో వివిటి మరో 19 మందితో యం.సి.సి. బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ గోపి తెలిపారు.

PTC, KRMNR

కామరెడ్డి-కలెక్టర్

కామారెడ్డి జిల్లాలో ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. నిన్న ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ ను పటిష్ఠంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే విడుదలైన పనులు కొనసాగిస్తూ, ప్రారంభం కానీ పనులు, టెండరు దశలో ఉన్నవి మొదలు పెట్టవద్దని, వాటి జాబితాలను 72 గంటలలోగా అందజేయాలని ఆదేశించారు.

డెస్క్

సిరిసిల్ల-కలెక్టర్

ఎన్నికల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని కలెక్టర్ , రాజన్న సిరిసిల్ల జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి అన్నారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ అధికారులతో మాట్లాడుతూ సి-విజిల్ యాప్ ద్వారా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై 100 నిమిషాల్లో తీసుకున్న చర్యలపై నివేదికను అప్ లోడ్ చేయాలన్నారు. రాజకీయ పార్టీలు ప్రచార కార్యక్రమాల అనుమతుల కోసం సువిధలో చేసుకున్న దరఖాస్తులను నిర్ణీత సమయంలోగా పరిశీలించాలని సూచించారు.

PTC, SIRCILLA

మంత్రి శ్రీనివాస్ గౌడ్-హైకోర్టు

మహబూబ్ నగర్  బిఆర్ఎస్ శాసనసభ్యుడు,  రాష్ట్ర అబ్కారీ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్కు హైకోర్టులో ఊరట లభించింది. ఎమ్మెల్యేగా ఆయన ఎన్నికకు సంబంధించి దాఖలైన పిటిషన్ను న్యాయస్థానం కొట్టివేసింది. 2018 ఎన్నికల్లో మహబూబ్ నగర్ ఎమ్మెల్యేగా శ్రీనివాస్ గౌడ్ పోటీ చేసినప్పుడు ఎన్నికల అఫిడవిట్ లో పూర్తి ఆస్తి వివరాలు వెల్లడించలేదని , పోలింగ్ అధికారుల సహకారంతో అఫిడవిట్ ను మార్చారని ఆరోపిస్తూ రాఘవేంద్రరాజు అనే వ్యక్తి 2019లో పిటిషన్ దాఖలు చేశారు. నాలుగున్నరేళ్లుగా ఈ కేసు విచారణ కొనసాగుతుండగా నేడు తుది తీర్పుతో మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఊరట లభించింది.

(డెస్క్)

నల్లగొండ-వ్యవసాయశాఖ

నల్లగొండ జిల్లా వ్యవసాయశాఖలో  గత రెండు రోజుల్లో  8 మంది అధికారులపై  సస్పెన్షన్ వేటుపడింది. విధినిర్వహణలో అలసత్వంగా వ్యవహరించడంతో పాటు జిల్లాలో యూరియా నిల్వల విషయంలో సరైన ప్రభుత్వానికి సమాచారం ఇవ్వని కారణంగా శనివారం ముగ్గురు అధకారులను,  నిన్న మరో ఐదుగురు అధికారులను సస్పెండ్ చేస్తూ వ్యవసాయశాఖ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. సస్పెన్షన్  కు గురైన వారిలో  దేవరకొండ ఏడీఈ, నల్లగొండ జెడిఏ కార్యాలయ సూపరింటెండెంట్, ఆరుగురు మండల వ్యవసాయ అధికారులు ఉన్నారు.

(పిటిసి, నల్లగొండ)

జగిత్యాల-పోలీస్

జగిత్యాల జిల్లా నుంచి పోలీస్   కానిస్టేబుల్ ఉద్యోగాల రాత పరీక్షలో అర్హులైన అభ్యర్థుల ధృవీకరణ పత్రాల తనిఖీ ఈనెల  12,13 వ తేదీల్లో జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్ లోని ట్రాఫిక్ ట్రైనింగ్ కేంద్రంలో నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ భాస్కర్ తెలిపారు.  12వ తేదీన సివిల్ , ఏఆర్ కు ఎంపికైన అభ్యర్థులకు , 13వ తేదీన TSSP, ఫైర్, ఎక్సైజ్, IT&C, ట్రాన్స్ పోర్ట్ కు ఎంపికైన అభ్యర్థుల పత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు.

(పీటీసీ- జగిత్యాల)

క్రికెట్

భారత్ ఆతిథ్యం ఇస్తున్న వన్డే ప్రపంచ కప్ క్రికెట్ టోర్నమెంట్లో ఈ రోజు హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్ లో శ్రీలంకతో పాకిస్థాన్ జట్టు తలపడనుంది. ఈ మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం అవుతుంది. ఈ టోర్నీలో భాగంగా జరిగిన తమ తొలి మ్యాచ్ లో పాకిస్థాన్ జట్టు.. నెదర్లాండ్స్ పై విజయం సాధించింది. శ్రీలంక జట్టు దక్షిణాఫ్రికా చేతిలో ఓడిపోయింది. కాగా, ఉప్పల్ స్టేడియంలో నిన్న జరిగిన మ్యాచ్ లో న్యూజిలాండ్ 99 పరుగుల తేడాతో నెదర్లాండ్స్ పై విజయం సాధించింది.

(డెస్క్)

సిరిసిల్ల -వేములవాడ

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో , ఈనెల 15 నుంచి 28 వరకు శ్రీ దేవి నవరాత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు.తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల సందర్భంగా రాజరాజేశ్వరి దేవి అమ్మవారు భక్తులకు వివిధ రూపాల్లో దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 20న మూలానక్షత్రం సందర్భంగా పుస్తకరూపిణి మాహాసరస్వతీ పూజ , 22న దుర్గాష్టమి సందర్భంగా చండీకలశ ప్రతిష్ఠ, చండీహవనం నిర్వహించనున్నారు.

PTC, SIRCLLA